ఘనంగా ప్రపంచ బాలల హక్కుల దినోత్సవం

విశాలాంధ్ర - ఎల్ఎన్‌పేట : లక్ష్మీ నర్సు పేట గ్రామంలో ప్రపంచ బాలల హక్కుల దినోత్సవం, నషా ముక్త్ భారత్ అభియాన్ (మాదక ద్రవ్యాల రహిత)కార్యక్రమాన్ని మోడల్ ప్రాథమిక పాఠశాల లయన్స్ క్లబ్ బాలల హక్కుల పరిరక్షణ వేదిక సక్షం శ్రీకాకుళం జిల్లా గురుదేవా ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సర్వీస్ ఛైర్పర్సన్ బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కార్యదర్శి సక్షం, జిల్లా కన్వీనర్ గురుదేవా ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి సామాజిక వేత్త లయన్ డా.ఎం.కె.మిశ్రో, ప్రధానోపాధ్యాయులు బి.రమాదేవి, గ్రామ రెవిన్యూ అధికారి రమణమ్మ, ఉపాధ్యాయులు ఎన్.రామరావు, పి.లక్ష్మణరావు, టి.ఉపేంద్ర పాల్గొన్నారు.

విశాలాంధ్ర శ్రీకాకుళం

పేజి నెం. 9

శుక్రవారం 21, నవంబర్ 2025

తగ్గని ధరలు..!

- రోగులను దోచుకుంటున్న మెడికల్ షాపుల యజమానులు..?
- జీఎస్టీ తొలగించినా పాత ధరలతోనే యధేచ్ఛగా అమ్మకాలు
- డిస్కౌంట్ పేరిట వినియోగదారుల నెత్తిన శఠగోపం
- స్పందించని జిల్లా ఔషధ నియంత్రణ విభాగం

నేడు మారిన ఆహారపు అలవాట్లు, పంటల్లో ఎరువులు, పురుగుల మందులు వినియోగం ఎక్కువ కావడం, సారవంతమైన భూమి లేకపోవడం, కల్తీలు అధికంగా ఉండడం వెరసి ప్రతి ఒక్కరూ రోగాలతో సతమతమయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. గతంలో ఒకవైపు రోగానికి అవసరమైన చికిత్స ఇస్తూనే మరోవైపు సహజ పద్ధతుల్లో వ్యాధిని తగ్గించుకునే ఉపాయాన్ని కూడా చెప్పేవారు. అయితే ప్రస్తుతం వైద్యం వ్యాపారంగా మారడంతో సహజ పద్ధతులు ఏమిటన్నది ఇటు ప్రజలకు తెలిసే అవకాశం లేదు. అందుకు కారణం పేషెంట్లు తగ్గితే తమ వ్యాపారం తగ్గుతుందన్న ఒకే ఒక్క కమర్షియల్ కోణం అన్నది బహిరంగ రహస్యం.

విశాలాంధ్ర- శ్రీకాకుళం: మెడికల్ షాపుల యజమానులు రోగులను దోచుకుంటున్నారు. సామాన్యులకు అందుబాటులో లేని మందుల ధరల కారణంగా ఎంతో మంది అభాగ్యులు చికిత్సకు అవసరమయ్యే మందులు కొనలేక మరణాన్ని ఆహ్వానించే పరిస్థితులు అక్కడక్కడ మనం వినడం, చూడడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మందులపై జీఎస్టీని తొలగించి సామాన్యులకు మందుల ధరలను చేరువ చేయడం ద్వారా చికిత్సను సులభతరం చేయాలన్న సదుద్దేశంతో ముందుకు వచ్చింది. ఈ ప్రకటన వెలువడిన వెంటనే సామాన్య, పేద, మధ్య తరగతి ప్రజలు ఎంతో సంతోషించారు... సంబరపడ్డారు...అయితే క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయనేది సగటు వినియోగదారుడి ప్రధాన ఆరోపణగా ఉంది. జిల్లా వ్యాప్తంగా అధిక మెడికల్ షాపుల్లో జీఎస్టీ మినహాయింపును తమ మార్కు తెలివితేటలు ప్రదర్శిస్తూ వినియోగదారుడు వరకు చేరకుండా కొందరు యజమానులు దోచుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. కార్పొరేట్ మెడికల్ షాపులు వెలసిన తరువాత జిల్లా వ్యాప్తంగా మెడికల్ షాపుల్లో 10 శాతం మందులు కొనుగోళ్లపై డిస్కౌంట్ ఇవ్వడం సాధారణ విషయంగా మారింది. జీఎస్టీ తగ్గింపు తర్వాత ఆ 10 శాతం డిస్కౌంట్ కూడా కొందరు యజమానులు ఎగ్గొట్టి తమ గల్లా పెట్టిల్లో వేసుకుంటున్నారని బోగొట్ట.

పాతదరలకే అమ్మకాలు: జీఎస్టీ అత్యవసర మందులపై పూర్తిగా తొలగించగా పరిమిత మందులపై ఐదు శాతం మాత్రమే జీఎస్టీని ఉంచారు. జిల్లాలో మాత్రం మెడికల్ షాపుల్లో పాత ధరలకే మందుల అమ్మకాలు జరుగుతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం మెడికల్ షాపుల యజమానులు కొందరు సిండికేటుగా మరి జీఎస్టీని వినియోగదారుడు వరకు వెళ్లకుండా ఆడుకోవాలని నిర్ణయించుకోవడమే ప్రధాన కారణమని తెలుస్తోంది. ఎవరైనా జీఎస్టీ మినహాయింపు ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించినట్టయితే వారికి దూరుసుగా సమాధానం చెప్పడం, ఇష్టం ఉంటే మందులు కొనాలని.. లేదంటే దిక్కున్నచోట ఫిర్యాదు చేసుకోమంటూ బెదిరింపు ధోరణిలో మాట్లాడుతుండడంతో దిక్కుతోచని కొనుగోలుదారులు వ్యాధిని తగ్గించుకునేందుకు తప్పనిసరి పరిస్థితుల్లో వారు చెప్పిన ధరలకే మందులను కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఎవరైనా కాస్త గట్టిగా బిల్లు ఇవ్వాలని అడిగినట్లయితే అందుకు నిరాకరిస్తుండడం కొసమెరుపు. ప్రస్తుతం మార్కెట్లో పాత ఎంఆర్పి ధరలకే ఉన్న మందులను అదే ధరలకు అమ్ముతామని, కొత్తగా తగ్గించిన ధరలతో మెడికల్ స్టాక్ వచ్చినట్లయితే అప్పుడు మాత్రమే కొత్త జీఎస్టీ మేరకు అమలు చేస్తామని వీరు చెపుతుండడం పట్ల రోగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో ఔషధ నయంత్రణ విభాగం సిబ్బంది సహాయ సహకారాలు కూడా ఉన్నాయని రోగులు, మందుల కొనుగోలుదారులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం స్పందించి మెడికల్ షాపుల్లో తగ్గిన జీఎస్టీ ధరలతో మందులను విక్రయించే విధంగా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో పాటు పర్యవేక్షించే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రంథాలయాలతోనే ఉజ్వల భవిత
- ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్: గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుంటేనే యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని స్థానిక శాసనసభ్యులు గొండు శంకర్ అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వారం రోజులుగా జరిగిన 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

విద్యార్థులు, నిరుద్యోగులు, పుస్తక ప్రియులు గ్రంథాలయాలను సందర్శించడం ద్వారా కొత్త విషయాలతో పాటు జీవితంలో ఉపయోగపడే మెళుకువలను తెలుసుకోవచ్చని అన్నారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నగర టీడీపీ అధ్యక్షుడు పాండ్రంకి శంకర్, రిటైర్డ్ ప్రొఫెసర్ ఆరికతోట కనకరాజు, ముట్నూరు ఫణీంద్రశర్మ, సోడవరం.ఈశ్వర్రావు, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ భాస్కరాజా సహా గ్రంథాలయ సిబ్బంది, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

కాలువల్లో చెత్త వేస్తే కేసులు: సర్పంచ్ లోతుగెడ్డ

విశాలాంధ్ర - కొత్తూరు: చెత్తను కాలువల్లో వేస్తే ఇక నుండి పంచాయతీ కేసులు పెడుతుందని కర్లెమ్మ సర్పంచ్ లోతు గెడ్డ భగవాన్ నాయుడు హెచ్చరించారు. ప్రధాన వీధి కాలువల్లో ఎవరైనా చెత్త వేస్తే చర్యలు తప్పవన్నారు. గురువారం కాలువలు శుభ్రం చేయించారు.

ఎంపీడీఓ వి.నీరజ సూచనల మేరకు కర్లెమ్మ పంచాయతీలోని నేతాజీ నగర్ కాలనీకి పోయే రహదారికి ఆనుకొని ఉన్న ప్రధాన సాగునీటి కాలువలో పేరుకు పోయిన చెత్తను కర్లెమ్మ గ్రామ సర్పంచ్ లోతుగడ్డ భగవాన్ దాస్ నాయుడు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు శుభ్రం చేశారు. ప్రజలు ఇళ్ళల్లో చెత్తని కాలువలలో వేయకుండా ప్రతిరోజు మీ ఇంటి వద్దకు వస్తున్న చెత్త వాహనాలకు అందించాలన్నారు.

నౌపడలో గుర్తుతెలియని మృతదేహం

విశాలాంధ్ర - సంతబొమ్మాలి: సంతబొమ్మాలి మండలం నౌపడ గ్రామం కచ్చిరుపారంలో గుర్తుతెలియని వివాహిత మృతదేహం గురువారం లభ్యమయింది. సుమారు 40 సంవత్సరాలు వయసు కలిగి చీర కట్టుకొని ఉంది.

ముఖం మొత్తం దెబ్బలు తగిలి పోల్చలేని విధంగా మృతదేహం తయారయింది. విషయం తెలిసిన వెంటనే నౌపడ ఎస్సై నారాయణస్వామి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మృతదేహానికి రక్తం కారే గాయాలు ఉండడంతో హత్యగా పలువురు అనుమానిస్తున్నారు.

25న చలో సరుబుజ్జిలి

విశాలాంధ్ర - సరుబుజ్జిలి/బూర్జ: సరుబుజ్జిలి, బూర్జ మండల్ పరిధిలో 3200 మెగావాట్లు థర్మల్ విద్యుత్ ప్లాంట్ నిర్మించడానికి ప్రభుత్వం బలవంత భూ సేకరణ చేస్తుందని, దీనిని వ్యతిరేకస్తున్నామని థర్మల్ పవర్ ప్లాంట్ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ వాబ.యోగి అన్నారు.

ఈనెల 25వ తేదీన సరుబుజ్జిలిలో చలో ర్యాలీ కార్యక్రమం నిర్వహించనున్నామని, సంబంధిత పోస్టర్ వెన్నెల వలసలో ఆవిష్కరించినట్లు వాభా యోగి తెలిపారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ కార్యదర్శి సవర సింహాచలం, సహాయక కార్యదర్శి సవర ధర్మారావు, సవర మిన్నరావు, సవర అదయ్య, సవర చుక్కడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి తాగునీరు

విశాలాంధ్ర-రణస్థలం: మండలం రణస్థలం పంచాయతీలో గురువారం జల జీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి త్రాగునీరు అందించే లక్ష్యంగా శాసనసభ్యులు నడుకుదిటి ఈశ్వరరావు భూమి పూజ చేశారు.

ఈ కార్యక్రమం లో జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు రణస్థలం సర్పంచ్ పిన్నింటి వెంకట భానోజీ నాయుడు, డీజీఎం ఆనందరావు, పిసిని జగన్నాథం నాయుడు, బెందు మల్లేశ్వరరావు, మజ్జి వెంకటరమణ, కెల్ల హేమంత్, స్థానిక నాయకులు, పెద్దలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి పన్ను, ఆస్తి పన్ను శత శాతం సాధించాలి

విశాలాంధ్ర-హిరమండలం: ఇంటి పన్ను, ఆస్తి పన్నులు శత శాతం సాదించాలని డిప్యూటీ ఎంపీడీఓ కార్యదర్శులకు గురువారం దిశా నిర్దేశం చేశారు. గ్రామ పంచాయితీలలో ఇంటి పన్నులు వసూళ్ళుకు సంబంధించి డిమాండు నోటీసులు మాన్యువల్‌గా ఇవ్వరాదన్నారు.

సంబంధిత ఆస్తి యజుమానులకు ఇంటి పన్ను వసూళ్ళు చేయుటకు ఆన్ లైన్ ద్వారా వారి యొక్క వాట్సప్ గ్రూప్ /ఎస్ఎంఎస్‌లకు డిమాండు నోటీసులు పంపాలని ఆదేశించారు. శత శాతం వసూళ్ళు చేయుటకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ విషయమై ఇప్పటికే ఇద్దరు పంచాయితీ కార్యదర్శులపై క్రమశిక్షణాచర్యలు తీసుకున్నట్టు తెలిపారు.

ఉపాధ్యాయులకు బదిలీ సన్మానం

విశాలాంధ్ర-సోంపేట/కంచిలి: కంచిలి మండలం బసవపుట్టుగ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు సంధ్యా, ఎన్.శాంతమూర్తిలను గురువారం పాఠశాల ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు ఎస్.శివరాంప్రసాద్, చిట్టిబాబు చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. ప్రధానోపాధ్యాయురాలు జీవనజ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామపెద్ద రామారావు, యువకులు పాల్గొన్నారు.

నిబంధనలు పట్టించుకోని పోస్టల్ అధికారులు..!
- వృక్షాల తొలగింపు

విశాలాంధ్ర- ఆమదాలవలస: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛ భారత్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తూ పచ్చదనాన్ని పరిరక్షించాలని తద్వారా మానవాళి ఆరోగ్య పరిరక్షణకు దోహదపడాలని పథకాలు ప్రవేశపెట్టి అన్ని కార్యాలయాల్లోనూ ప్రతి మూడో శనివారం అమలు జరుపుతుంటే కేంద్ర ప్రభుత్వ అధీనంలో నడుస్తున్న ఆమదాలవలసలోని పోస్ట్ ఆఫీస్ అధికారులు మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కార్యాలయావరణంలో ఉన్న వృక్షాల ను ఇటీవల తొలగించారు. వాటి మొదుళ్లను బయటి వారికి కనిపించకుండా ఉండేలా చేసేందుకు వాటిపై రొట్టెలు వేసి నిప్పు పెట్టారు. అయినప్పటికీ అవి భారీ వృక్షాలు కావడంతో బయటకు కనిపిస్తున్నాయి. దాన్ని కప్పిపుచ్చుకునేందుకు తిరిగి మొక్కలు నాటుతామని అందుకే వాటిని తొలగించామని చెప్పుకోవడం విశేషం. ప్రభుత్వ కార్యాలయ ఆవరణలో వృక్షాలను తొలగించాలంటే నియమ నిబంధనల మేరకు సంబంధిత ఫారెస్ట్ అధికారులకు తెలియజేసి, వృక్షాలకు అంచనాల రూపొందించి బహిరంగ వేలం ద్వారా తొలగించాల్సి ఉంది. అయినప్పటికీ నిబంధనలు పట్టించు కోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పక్కనే ప్రభుత్వం కాలవనిర్మాణ పనులు తరుణంలో ఆ వృక్షాలను తెగ నరికి తరలించినట్లు తెలిసింది. కేంద్ర ప్రభుత్వ అధికారులై ఉండి కూడా ప్రభుత్వ నిబంధ నలను అనుసరించకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పోస్ట్ ఆఫీస్ కార్యాలయ ఆవరణలో తొలగించిన వృక్షాల స్థానంలో పచ్చదనాన్ని పరిరక్షించేందుకు మొక్కలు నాటాలని స్థానికులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

గ్రంథాలయాల ద్వారా విజ్ఞాన సముపార్జన

విశాలాంధ్ర-మెలియాపుట్టి: విద్యార్థులు విద్యార్థి దశ నుండే పాఠశాలల్లో పాఠ్యాంశాలతో పాటు గ్రామాలలో ఉన్న గ్రంథాలయాల ద్వారా విజ్ఞానాన్ని మరింతగా పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా అన్నారు. మెలియాపుట్టి మండల కేంద్రంలో గల స్థానిక శాఖగ్రంథాలయంలో గ్రంథాల యధికారిని అనురాధ నేతృత్వంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా, ఎంఈఓ ఎస్. దేవేందరరావు, సబ్ ఇన్స్పెక్టర్ పి.రమేష్ బాబులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులకు గ్రంథాలయలలు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు గోవిందరావు, నలంద పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ జె జె ఎస్ ప్రతాప్, ఉపాధ్యాయులు అనిల్ కుమార్, పి ఈ టి, స్వరూప, శాంతి కుమారి, నీలిమ, మహిళా పోలీస్ భారతి, రీడర్స్ ప్రియాంక, గణేష్, సహాయకురాలు హేమలత పాల్గొన్నారు.

మరో పోరాటానికి సిద్ధమైన అగ్రిగోల్డ్ బాధితులు

విశాలాంధ్ర - సోంపేట: దశాబ్దాలుగా న్యాయం కోసం పోరాడుతున్న ఫలితం దక్కని పరిస్థితుల్లో అగ్రిగోల్డ్ బాధితులు మరోపోరాటానికి సిద్ధమయ్యారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై దాదాపు రెండేళ్లు కావస్తున్నా అగ్రిగోల్డ్ బాధితుల సమస్యపై సర్కార్‌కు స్పందన లేకపోవడంతో మళ్లీ రోడ్డెక్కేందుకు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ గౌరవ అధ్యక్షులు ముప్పాల నాగేశ్వరరావు పిలుపు మేరకు మండల నియోజకవర్గ స్థాయి పోరాట సంఘాలు సిద్ధమవుతున్నట్లు అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర మహిళ కార్యదర్శి పుక్కళ్ల అరేలమ్మ విలేకర్లకు తెలిపారు. ఈ మేరకు సోంపేటలో గురువారం అగ్రిగోల్డ్ ఏజెంట్లతో సమావేశ మయ్యారు. అగ్రిగోల్డ్ కంపెనీ బోర్డు తిప్పేసి వచ్చే జనవరి 4 నాటికి సరిగ్గా పుష్కర కాలం అవుతుందని అన్నారు. ఇంత కాలం గడచినా అటు టీడీపీ గాని, మొన్నటి వైసీపీ

గాని, ఇప్పటి కూటమి ప్రభుత్వం గాని సరైనరీతిలో కోట్లాది మంది బాధితుల పట్ల స్పందించకపోవడం దారుణమని అన్నారు. అగ్రిగోల్డ్ యాజమాన్యాలతో బడా రాజకీయనేతలు కుమ్మక్కై బాధితుల పోరాటాన్ని నీరు గార్చడం తప్పా న్యాయం చేద్దామన్న ఆలోచన కాసింత కూడా లేకపోవడం దురదృష్టకరమని అన్నారు. ఇప్పటికైనా బాధితులకు న్యాయం జరగకపోతే బలవర్మరణాలే శరణ్యమని అరేలమ్మ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్స్ అసోసియేషన్ మండల నాయకులు గిరిబాబు, ఈ.భాస్కరరావు, డి.లోకనాథం, జె.ఏకాంబరం, పి.లోకనాథం, జె.భాస్కరరావు, ఎస్.సురేష్, పి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విలువల గల సమాజం తత్త్వశాస్త్రంతోనే సాధ్యం

విశాలాంధ్ర- ఎచ్చెర్ల: విలువలు, మానవత కలిగిన సమాజం నిర్మాణం తత్త్వ శాస్త్రంతోనే సాధ్యమని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. వర్సిటీలో గురువారం ఫిలాసఫీ డే సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సాంకేతికత పారదర్శకత, జవాబుదారీ తనంకు దోహదపడుతుంటే, మానవతా విలువల సమాజ నిర్మాణంలో తత వ్శాస్త్రం ప్రధాన భూమిక పోషిస్తుందన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల (శ్రీకాకుళం) అధ్యాపకుడు డాక్టర్ వెంకటరావు మాట్లాడ తూ తాత్విక బోధన అధ్యయన అంశాలు అనేక సమస్యలకు పరిష్కారమార్గాన్ని చూపుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి. అడ్డయ్య, ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం. అనూరాధ, డాక్టర్ సీహెచ్. రాజశేఖరరావు, డాక్టర్ కె. స్వప్నవాహిని, హర్షపు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, ఎన్వో డాక్టర్ ఎస్. సామ్రాజ్యలక్ష్మి, డాక్టర్ ఎన్. సంతోష్ రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు. బీఆర్‌యూలో పుస్తక ప్రదర్శన-వర్సిటీలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీసీతో వర్సిటీ గౌరవ లై బ్రేరియన్ డాక్టర్ ఎన్.గోవిందరాజు, వర్సిటీ లైబ్రేరియన్ జి.భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం
ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

విశాలాంధ్ర - నరసన్నపేట: రాష్ట్రంలోని నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అభివర్ణించారు. గురువారం స్థానిక రహదారులు, భవనాల శాఖకు చెందిన గెస్ట్ హౌస్‌లో ఆయన నియోజకవర్గంలోని 47 మంది లబ్ధిదారులకు సుమారు రూ.25,17,677 చెక్కులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని నిరుపేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన కుటుంబాల ఆరోగ్యానికి రాష్ట్ర ముఖ్యమంత్రి, చంద్రబాబు నాయుడు భరోసా ఇస్తున్నారని తెలిపారు. ఒకవేళ ప్రాణాపాయ స్థితిలో ఉన్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి నిధులు మంజూరు చేసి, వారికి పునర్జన్మ ఇస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్, బగ్గు అర్చన, పొందర కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్, దామోదర నరసింహులు, టిడిపి నాయకులు, శిమ్మ చంద్రశేఖర్, గొద్దు చిట్టిబాబు, కత్తిరి వెంకటరమణ, సరిపల్లి మధు, అడపా చంద్రశేఖర్, వంజల రామరాజు, రావాడ గణపతి రావు, వెలుగు శ్రీరాములు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరం
- ప్రభుత్వ విప్ అశోక్

విశాలాంధ్ర-కవిటి: ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ అన్నారు. ఈ మేరకు గురువారం రామయ్యపుట్టుగలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 19 మంది బాధితులకు రూ. 14,07,503 లను చెక్కుల రూపంలో వారికి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరికి ఎటువంటి ఆపద వచ్చిన ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, బాధితులు పాల్గొన్నారు.

అక్రిడిటేషన్లకై జర్నలిస్టుల పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలి
- డిఐపిఆర్ఓ కమ్మినాన చెన్నకేశవరావు

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్: అక్రిడిటేషన్లు దరఖాస్తు చేసుకోదలచిన జర్నలిస్టులు తమ పేపర్లు ఛానల్స్ పేర్లను ఆన్ లైన్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కమ్మినాన చెన్నకేశవరావు తెలిపారు.

సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు విజయవాడ నుండి రాష్ట్రంలోని అందరు జిల్లా అధికారులతో గురువారం ఆయన జూం కాన్ఫరెన్స్ నిర్వహించారు. పెద్ద పత్రికలు, శాటిలైట్ ఛానల్స్, ఎంపానెల్డ్ చిన్న పత్రికలకు సంబంధించి డాక్యుమెంట్లను సమాచార పౌర సంబంధాల శాఖ, విజయవాడ కార్యాలయంలో పేర్ల నమోదుకు చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఎం ప్యానల్ కాని చిన్న పత్రికలు సొంత రన్నింగ్ కేబుల్ కలిగి యున్న కేబుల్ నెట్వర్కు జర్నలిస్టులు జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి వద్ద పత్రిక లకు సంబంధించిన పత్రములను సాఫ్ట్ కాపీలు హార్డ్ కాపీలు అందజేసి నమోదు చేసుకోవాలన్నారు. https://mediarelations.ap.gov.in వెబ్ సైట్‌లో తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

అనాథ మృతదేహం అంత్యక్రియలకు అభయం సేవా సంఘం సాయం

విశాలాంధ్ర-టెక్కలి: సంతబొమ్మాళి మండలం ఇజ్జువరం గ్రామ సమీప పంటపొలంలో ఆదివారం గుర్తు తెలియని మృతదేహం గుర్తించిన గ్రామస్తులు, వి.ఆర్.వో రిపోర్ట్ మేరకు, సంతబొమ్మాలి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మృతదేహం వివరాలు తెలియకపోవడంతో టెక్కలి జిల్లా హాస్పిటల్ మార్చురీలో 3రోజులు ఉంచారు. ఎవరు ఆ మృతదేహం కోసం రాకపోవడంతో పోలీసు శాఖ వారు, పంచాయితీ కార్మికులతో ఖననం చేయించారు. ఈ ఖననానికి టెక్కలి అభయం యువజన సేవా సంఘం ఆర్థికసాయం చేసినట్టు సంఘం స్థాపకులు దేవాది శ్రీనివాసరావు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో అభయం సేవా సంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాసరావు, ట్రెజరర్ శ్రీనివాస్ బెహరా పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయాల వారోత్సవాలు

విశాలాంధ్ర-ఆమదాలవలస: 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా పలువురు అతిథులు పాల్గొని వారోత్సవాల గ్రంథాలయ వారోత్సవాల విశిష్టతను వివరించారు. పుస్తక పఠనాన్ని ప్రోత్సహించేందుకే గ్రంథాలయ వారోత్సవాలని వక్తలు వివరించారు. ఇటీవల జరిగిన పలు పోటీ పరీక్షలలో విజేతలకు ముఖ్య అతిథులు లైన్స్ క్లబ్ అధ్యక్షులు, కార్యదర్శులు, డైరెక్టర్లు, ఎంఈఓ, జలుమూరు వెంకటేశ్వరరావు, వీటి చౌదరి, విజయలక్ష్మి భాయ్, బుడుమూరు సూర్యారావు, ప్రదీప్, ఎంఈఓ కేవీ రాములు బహుమతులు అందించారు. ఇప్పటివరకు జరిగిన పోటీల్లో న్యాయ నిర్ణేతగా అంపోలు సూర్యరావు, తమ్మినేని సూర్యనారాయణ, పైడి భవాని, కిషోర్, ఎం.జయలక్ష్మిలు వ్యవహరించారు.

ఈ వారం రోజు లు పాటు నిర్వహించిన పాటల పోటీలు, క్విజ్, వక్తృత్వ పోటీలు, వ్యాసరచన, రంగవల్లికలు చిత్రలేఖనం లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల గ్రహీ తలకు రోటరీ క్లబ్, లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి అన్నెపు కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

సెల్ టవర్ మాకొద్దు

- జె ఆర్ పురం కాలనీ వాసులు ఆందోళన

విశాలాంధ్ర-రణస్థలం: మండల కేంద్రం జి ఆర్ పురం కాలనీ సమీపంలో ఉన్న ఆఫీస్ 6వ వార్డ్ కు అనుకొని డబ్ల్యుఎంఈ చర్చి వారి స్థలంలో ఎయిర్టెల్ టవర్ నిర్మాణం జరుగుతుంది. టవర్ జనవాసాలకు దూరంగా పెట్టాలని కాలనీవాసులు గ్రామస్తులు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ టవర్ వల్ల రేడియేషన్ మరియు ప్రజలకు అనారోగ్య సమస్యలు వస్తాయని వెంటనే టవర్ నిలుపుదల చేసేలా పంచాయతీ అధికారులు, రెవెన్యూ అధికారులు, చొరవ తీసుకోవాలని గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళన కార్యక్రమంలో జోగ ఆది, లండ సుధా, షేక్ శ్రీను, వాడది పాణికుమార్, చిన్నమ్మాడు, లక్ష్మి, శారదా, రాజాలక్ష్మి, కుమారి, శంకర్, రాము తదితరులు పాల్గొన్నారు.

జీవనశైలి మార్పులతో "క్యాన్సర్ నివారణ"

- డా.పైడి సింధూర

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: జీవనశైలి, ఆహారపు అలవాట్లతో కాన్సర్ బారినపడుతున్నారని, అదే జీవనశైలి మార్పులతో క్యాన్సర్ ను కొంతమేరకు నివారించవచ్చని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షురాలు డా.పైడి సింధూర అన్నారు. మునసబుపేట గురజాడ గాయత్రి కళాశాలలో, ప్రపంచ ప్యాంక్రియాటిక్ క్యాన్సర్అవగాహనా ధినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ మెంటార్ నటుకుల మోహన్ ఆధ్వర్యంలో ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులకు ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ పై ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డా.పైడి సింధూర మాట్లాడుతూ ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ అనేది ప్యాంక్రియాస్‌లో కణాలు నియంత్రణ లేకుండా పెరిగే ఒక రకమైన క్యాన్సర్ అని, దీని సాధారణ లక్షణాలు పొత్తికడుపు లేదా వీపు నొప్పి, బరువు తగ్గడం, కామెర్లు (చర్మం, కళ్ళు పసుపు రంగులోకి మారడం), వికారం, ఆకలి లేకపోవడం వంటివి ముఖ్య లక్షణాలన్నారు. ఇది ప్రారంభ దశలలో తరచుగా ఎటువంటి లక్షణాలను చూపించదని, ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ చికిత్సలు క్యాన్సర్ దశ, రోగి ఆరోగ్యం ఆధారంగా మారుతూ ఉంటాయన్నారు. ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వంటి జీవనశైలి మార్పుల ద్వారా ఈ క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించవచ్చన్నారు. ఇందులో భాగముగా డా. బి.శ్రావ్య మాట్లాడుతూ క్యాన్సర్" కు మానసిక దృఢత్వం అవసరమని, ముందుగా గుర్తిస్తే క్యాన్సర్ ను జయించవచ్చని, ప్రతీ మూడు నెలలకు ఆరోగ్యపరీక్షలను వైద్యుల సలహాలతో చేయించుకోవాలన్నారు. కూరగాయలు, ఆకు కూరలు ఎక్కువగా తీసుకోవాలని, వీటిలో క్యాన్సర్ పోరాడే యాంటిజెన్స్ ఉంటాయన్నారు. సర్వైకల్ క్యాన్సర్ వేక్సిన్ అందుబాటులో ఉందని తెలిపారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ కెవి.సత్యన్నారాయణ విద్యార్థులకు ఆరోగ్యకరమైన జీవితానికి దోహదపడే అంశాలను ప్రస్తావించి, అవగాహన కల్పించారు. అవగాహన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ సీనియర్ సభ్యులు జివిఎన్వి కిరణ్, ఛైర్పర్సన్ పొడుగు.చరణ్, సభ్యులు చౌదరి శ్రీనివాస్, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

వరిలో చిరిసంచుల క్షేత్ర సందర్శన

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండలం పుటియదల, జగతి వరి పంటలో నిర్వహిస్తున్న వరిలో చిరి సంచుల ప్రదర్శన క్షేత్రాన్ని గురువారం వ్యవసాయ పరిశోదన శాస్త్రవేత్తలు ఉదయ్ బాబు, మధుకుమార్, శ్రీనివాస్ లు క్షేత్ర సందర్శన చేశారు. దిగుబడులు పెరగడంతో రైతులందరూ ఇలా చిరు సంచులతో సాగుచేయడం వలన లాభాలు పొందుతారని తెలిపారు. ఈ కార్యక్రమం లో సోంపేట ఏడీఏ భవానీ శంకర్, ఏవో పి శ్రీదేవి, స్థానిక రైతులు పాల్గొన్నారు.

డైరీ యూనిట్స్ రుణాలకు ఇన్సూరెన్స్ పై అవగాహన

విశాలాంధ్ర-సరుబుజ్జిలి: గురువారం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో పశుసంవర్ధక శాఖ సిబ్బందికి, వెలుగు సిబ్బందికి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పశు సంవర్ధక శాఖ ఎ. డి. రోనంకి ఆనందతరావు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ద్వారా తీసుకున్న డైరీ యూనిట్స్ రుణాలుకు బాధ్యతగా ఇన్సూరెన్స్ చేయుంచుకోవటం మంచిదని, ఇన్సూరెన్స్ వలన కలిగే ప్రయోజనాలు, ఇన్సూరెన్స్ చేసుకొని పక్రియ, ఇన్సూరెన్స్ ఆవశ్యకత ఎమ్. ఎమ్. ఎస్. కార్యకర్తలకు అవగాహన కల్పించినట్లు ఏ. పి. ఎమ్. సి. హెచ్. గోవిందరాజులు తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో ఎమ్. ఎమ్. ఎస్. అధ్యక్షులు పెడాడా మణెమ్మ, సీసీ లు, వీ. వో.ఏ లు, సచివాలయం సిబ్బంది, వెటర్నరీ అసిస్టెంట్లు హాజరు అయినట్లు తెలిపారు.

కొతమ్మతల్లి సన్నిధిలో అన్నదానం

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: స్థానిక శ్రీ కొత్తమ్మతల్లి సన్నిదిలో గురువారం ఆలయ కార్యనిర్వాహాధికారి వాకచర్ల రాధాక్రిష్ణ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్తీక మాసం కావడంతో అమ్మవారికి భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భోజన సమయంలో దర్శించుకున్న సుమారు 500 మంది భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కోరాడ చిన్నగోవింద, సభ్యులు బొమ్మాళి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్థాయి

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : తరగతి గదిలో విద్యార్థులతో మెలిగే విధానం బాగుంటే సమాజం గుర్తిస్తుందని మండల విద్యాశాఖ అధికార్లు కారు పున్నయ్య, జి. రాజకిషోర్లు అన్నారు. అజ్జరం పంచాయతీలో పనిచేసే ఇటీవల బదిలీపై వేరే పాఠశాలకు వెళ్లిన ఇరువురు ఉపాధ్యాయులు ఎస్ పి వి రమణ విష్ణుమూర్తి లకు ఆత్మీయ సన్మానం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రామస్తులు నాయకులు తల్లిదండ్రులు మెచ్చిన విధంగా ఆదర్శవంతంగా పనిచేస్తే ఎప్పుడూ గౌరవం ఉంటుందని అన్నారు ఇటువంటి గ్రామాలను దత్తత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అజ్జరం గ్రామపంచాయతీ సర్పంచ్ ప్రతినిధి బోర సాయిరాం, ఎంపీటీసీ సభ్యులు బోర గోవిందరెడ్డి, గ్రామ నాయకులు రమణారెడ్డి హెచ్ఎంలు ఆర్ సుగంధవల్లి రఘురాం, సాయికిరణ్, కుసుమ,ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు

58వ జాతీయ గ్రంధాలయల వార్షికోత్సవలు

విశాలాంధ్ర-సరుబుజ్జిలి: సరుబుజ్జిలి మండలంలో 58వ గ్రంథాలయాల వార్షికోత్సవాలు ముగింపు సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా ఎమ్. పి. డి. ఓ. పావని, ఈఓ. పి. ఆర్. డి. రామారావు పాల్గొన్నారు. కార్యక్రమంలో పావని మాట్లాడుతూ విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధ వహించాలని, పుస్తక పఠనం విజ్ఞానం పెంపొందించటానికి ఒక ఔషధం వంటిదని అన్నారు. అబ్దుల్ కాలం, నెల్సన్ మండేలా వంటి విద్యావేత్తలను ఆదర్శంగా తీసుకోని ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయం అధికారి కే. యర్రమ్మ, స్థానిక ఎమ్.పి.టీ.సి. ఇల్లాకల ప్రకాష్, టీడీపీ మండల యువత అధ్యక్షులు దవల సింహాచలం, మండల టీడీపీ ఎస్. సి. సెల్. అధ్యక్షులు ఇల్లాకల ప్రభాకర్, స్థానిక ప్రాదిమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గున్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-టెక్కలి: 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నేటితో ముగిసినట్లు గ్రంథాలయ అధికారిని బి. రూపవతి తెలిపారు. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక తహసిల్దార్ ఎం సత్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రంథాలయంలో ఎన్నో విలువైన పుస్తకాలు ఉన్నాయని, వీటిని అందరూ చదవడం వలన ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని అన్నారు. సెల్ ఫోన్లు వినియోగాన్ని తగ్గించుకోవాలని విద్యార్థులకు తెలిపారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఎం సోమరాజు, రవికుమార్, ఎన్ వాణిశ్రీ, బి స్వాతి, రిటైర్డ్ గ్రంథాలయ అధికారి గున్న ప్రసాద్, యోగ ఉపాధ్యాయులు నాగభూషణ్, విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సహాయకురాలు అమ్మనమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండలం మాణిక్యపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 5 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి అండర్-14 సాఫ్టుబాల్ బాయ్స్ అండ్ గర్ల్స్ క్రీడాపోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు మజ్జి వైకుంఠరావు తెలిపారు. ఎంపికైన వారిలో సుజాత జన్ని,సమీరా సాహు, శివం సాహు, మద్రిపాటి.హర్షవర్ధన్, డొక్కరి నానీలు ఎంపికయ్యారు. వారు ఈ నెల 22న పులివెందులలో జరిగే పోటీలల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా వారిని,వ్యామ ఉపాధ్యాయులు రవికుమార్ మహంతి, ఎం.తోటా రావులను పాఠశాల వద్ద అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

26న జరిగే నిరసన ప్రదర్శనలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-పలాస: రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలకు నిరసనగా ఈ నెల 26న జరిగే నిరసన ప్రదర్శనలు జయప్రదం చేయాలని కార్మిక, రైతు,సంఘాల ప్రతినిధులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ప్రజా సంఘాల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీఐటీయూ, సిపిఐ ఎం యల్ న్యూ డెమోక్రసీ, లిబరేషన్ నాయకులు యన్ గణపతి, వంకల మాధవరావు,మద్దిలి రామారావు లు మాట్లాడుతూ కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ లు, రైతు వ్యతిరేక నల్ల చట్టాలు వల్ల కార్మికులు, రైతులు బానిసత్వం లోకి నెట్టబడ్డారని అన్నారు. ఈ చట్టాలు రద్దు కోసం, గత నాలుగు ఏళ్లుగా అటు ఢిల్లీ కేంద్రంగా రైతులు, దేశ వ్యాప్తంగా కార్మికులు, రైతులు ఆందోళనలు చేస్తున్నారని తెలిపారు.నవంబర్ 26 రైతులు ఢిల్లీ కేంద్రంగా పోరాటం ప్రారంభించిన రోజని, అదే రోజున మన నిరసన తెలియజేయడం జరుగుతుందని అన్నారు ఈ సందర్భంగా నవంబర్ 26 న కాశీబుగ్గ రైల్వే స్టేషన్ రోడ్ నుండి కాశీబుగ్గ బస్టాండ్, గాంధీ బొమ్మ వరకు నిరసన ర్యాలీ చేపడతామని, ఈ ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో వివిధ సంఘాల ప్రతినిధులు టి అజయ్ కుమార్,యన్ ఢిల్లేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

అనాథ మానసిక వికలాంగుల సేవలో మనోబంధు ఫౌండేషన్

-రెడ్ క్రాస్ సంస్థ ముందడుగు

- జిల్లా ఎస్పీ చేతుల మీదుగా మనోబంధు అంబులెన్స్‌కు ప్రారంభం

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: అనాథ మానసిక వికలాంగుల సేవలో మనోబంధు ఫౌండేషన్, రెడ్ క్రాస్ సంస్థతో కలిసి పనిచేయడం శుభ సూచికమని జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆయా సంస్థలు సేవలను కొనియాడారు. ఈ సేవా కార్యక్రమాల్లో భాగంగా, గురువారం ఎస్పీ జిల్లా పోలీసు కార్యాలయంలో మనోబంధు అంబులెన్స్ కు జెండా ఊపిన్ ప్రారంభించి, గోడ పత్రికలను ఆవిష్కరించారు. మనోబంధు ఫౌండేషన్, రెడ్ క్రాస్ వంటి సంస్థలు సమాజంలోని అత్యంత అవసరమైన మానసిక వికలాంగులకు అండగా నిలవడం అభినందనీయం. మానసిక వికలాంగుల పునరావాసం కోసం ప్రభుత్వం, పోలీసు శాఖ, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయడం వల్ల మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. ఈ అంబులెన్స్ ద్వారా జిల్లాలోని రోడ్లపై నివసిస్తున్న మానసిక వికలాంగులను గుర్తించి, వారికి ఆహారం, వైద్యం, ఆశ్రయం వంటి సేవలు అందించేందుకు వీలు కలుగుతుంది అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మనోబంధు ఫౌండేషన్ ఉత్తరాంధ్ర కన్వీనర్ బీన ఢిల్లీ రావు, రాష్ట్ర సూపర్వైజర్ బాల సురేష్, రెడ్ క్రాస్ సంస్థ జిల్లా చైర్మన్ పి. జగన్మోహన్ రావు, కళ్యాణ్ చక్రవర్తి, పెంకి చైతన్యకుమార్, చిన్మయరావు,

వైసీపీ నుండే స్థానిక సంస్థ ఎన్ని కల బరిలో

- మాజీ జడ్పీటీసీ లోలుగు కృష్ణవేణి.లక్ష్మణరావు

విశాలాంధ్ర-హిరమండలం: రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో వైఎస్సార్సీపీ పార్టీ నుంచే పోటీ చేస్తామని మాజీ జడ్పీటీసీ సభ్యురాలు లోలుగు కృషవేణి రుగడ పంచాయతీ మాజీ సర్పంచ్ లోలుగు లక్ష్మణరావు లు వెల్లడించారు. గురువారం మీడియా సమావేశం లో కృష్ణవేణి లక్ష్మ ణరావు లు మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్య మంత్రి అవ్వడం ఖాయమని వైసీపీ నుండి జిల్లా ఎంపీ అభ్యర్థి గా తూర్పుకాపు లకు టికెట్ ఇస్తే కాపులమంతా గెలుపించుకుంటామన్నారు. మా పదవి కాలంలో సుమారుగా 3 కోట్లు రూపాయల అభివృద్ధి పనులు ను చేశామని జిల్లా పరిషత్ నిధులు పంచాయతీ నిధులు అన్నీ కలిపి రుగడ నుంచి ఎగువ రుగడకు 1 కోటి రూపాయలుతో సీసీ రోడ్డు నిర్మించడం జరిగిందని ఎగువ గూడ, ఈతలగూడ కు చెందిన 15 గిరిజన కుటుంబాలకు 15 ఇల్లు నిర్మించి ఇవ్వడం జరిగిందని, ఎం ఆవలింగి జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల కు 25 లక్షలు రూపాయలు తో ప్రహరీ గోడ నిర్మించామని రుగడ పంచాయతీ కార్యాలయభవనం ను నిర్మించడం జరిగిందని వెల్లడించారు. ఎంపీపీ బీసీ జనరల్ అయితే ఎంపీటీసీ గా జడ్పీటీసీ బీసీ జనరల్ అయితే జడ్పీటీసీ అభ్యర్థి గా సర్పంచ్ గా పోటీ చేసే ఉద్దేశ్యం లేదని కానీ సర్పంచ్ నుంచి మా కుటంబాలు నుంచి మాత్రం పోటీ చేస్తా మని తెలిపారు. ప్రస్తుతం పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తో వైసీపీ బలోపేతం అవుతుందని వైసీపీ నుండే జడ్పీటీసీ గా సర్పంచ్ గా ఇది వరకు గెలిచామని చెప్పు కొచ్చారు. బొమ్మిక గూడ కు 2 కిలోమీటర్లు మేర సీసీ రోడ్డు నిర్మాణం చేసామని అభివృద్ధి చేసాము మా ప్రజానీకం మాకు స్థానిక సంస్థ ఎన్ని కల్లో పట్టం కడతారని ఈసందర్భంగా పేర్కొన్నారు.. మళ్ళీ ఆసక్తి కదనాలు త్వరలో వెల్లడిస్తామన్నారు.

మాతృమూర్తి యువజన సంఘం ఆర్థిక సాయం

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండలం బి. గొనప పుట్టుగ గ్రామానికి చెందిన చరణ్, అనన్యల తల్లిదండ్రులను కిడ్నీ వ్యాధి బలి తీసుకుంది. దీంతో చిన్నారులు అవస్థలు పడుతున్నారు.ఇది తెలుసుకున్న కుసుంపురం కేంద్రంగా పని చేస్తున్న మాతృమూర్తి యువజన సంఘం సభ్యులు గురువారం చిన్నారులకు రూ. 8 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బద్రి ప్రకాష్, బొడ్డ జగదీష్,సభ్యులు ఏ. సురేష్, భాస్కర్, సర్వేష్, అశీష్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వీఆర్ఎల సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర-కవిటి: గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ బి.మురళీమోహనరావుకు గురువారం మండలంలోని రెవెన్యూ సహాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సహాయకులకు తక్షణమే పే స్కేల్ అమలు చేయాలని,అర్హత ఉన్న వీఆర్ఎలకు వీఆర్వో గా ప్రమోషన్లు ఇవ్వాలని,ఏళ్ల తరబడి నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్ఎలుగా నియమించాలని, అటెండర్ మరియు నైట్ వాచ్మెన్ ప్రమోషన్ కోటాను 20శాతం నుండి 70శాతానికి పెంచాలని, అక్రమ డ్యూటీలను రద్దు చేయాలని, వీఆర్ఎల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి, పరిష్కరించే దిశగా తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. వినతి అందజేసిన వారిలో కాళీ, జగదీష్, తెల్లోడు, పీతాంబర్, విజయ, లక్మీ,మోహినమ్మ, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో విజేతలకు బహుమతులు

విశాలాంధ్ర -పోలాకి: పోలాకి శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు జరిగిన గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, డిబేట్, రంగవల్లికలు మరియు డ్రాయింగ్ కాంపిటేసన్ లో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు గురువారం స్థానిక సర్పంచ్ మజ్జి రమణమ్మ మరియు ముఖ్య అతిథి తాడి ఎర్రయ్య ఎంపీటీసీ ప్రతినిధి తూలుగు అశోక్ ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వై.వి హరికృష్ణ తెలుగు టీచర్ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో మిగులు సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

విశాలాంధ్ర-ఆమదాలవలస: ఆమదాలవలస లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ని గ్రూపులలో మిగులు సీట్లకు స్పాట్ అడ్మిషన్లు ప్రారంభ మైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్ ఎస్ ఎన్ స్వా మి తెలిపారు. బి ఏ పొలిటికల్ సైన్స్, బి ఏ హిస్టరీ, బీకాం కంప్యూటర్స్లో మిగులు సీట్లలో స్పాట్ అడ్మి షన్లు ఇవ్వనున్నట్లు వివరించారు. డిగ్రీ ప్రథమ సంవ త్సరంలో చేరాలనుకునే వారు అన్ని ఒరిజినల్ సర్టి ఫికెట్స్ తో కళాశాలలో సంప్రదించాలని కోరారు. మరి న్ని వివరాలకు 9515225991, 9505504447, 6301183553 సంప్రదించాలని కోరారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలన్నారు.

చైల్డ్ సేఫ్టీ పై విశ్వశాంతి స్కూల్ విద్యార్థులు ర్యాలీ

విశాలాంధ్ర-నరసన్నపేట: స్థానిక మఠం వీధిలో ఉన్న విశ్వశాంతి స్కూలుకు చెందిన విద్యార్థులు గురువారం చైల్డ్ సేఫ్టీ వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఎస్వి సిటీ, పడాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీ స్థానిక పంచాయతీ కార్యాలయం నుండి బజార్ వీధి మీదుగా విశ్వశాంతి స్కూలు వరకు నిర్వహించారు. అనంతరం చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ పిల్లలపై లైంగిక దాడులు జరగకుండా, పిల్లలు సురక్షితంగా ఉండేందుకు పలు సూచనలు చేశారు, ఈ కార్యక్రమంలో ఎస్ వి సిటీ ప్రతినిధులు, పడాల చారిటబుల్ ట్రస్ట్ పడాల చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు, విశ్వశాంతి స్కూల్ కు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరుతడి పంటలతో అధిక లాభాలు

విశాలాంధ్ర -పలాస: ఆరుతడి పంటలతో అధిక లాభాలు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి పోలవరం అన్నారు. గురువారం పలాస మండలం కైజోల మరియు మహాదేవపురం గ్రామాలలో ప్రధాన మంత్రి రాష్ట్రీయ కృషి వికాస యోజన మరియు ఆత్మ పథకంల క్రింద రైతులకు వరి, మినుములు, పెసర, మొక్కజొన్న, వేరుశెనగ పంటలలో అధిక దిగుబడులు సాధించడానికి మేలై న యాజమాన్య పద్ధతలు గురించి అవగహన కల్పించారు.పెసర, మినుములలో వేపనూనె, 19-19-19,మరియు క్లోరోఫైరీపోస్ మందులు వాడితే అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. అలాగే మొక్కజొన్న లో ఎరువులు యాజమాన్యం, కలుపు యాజమాన్యం, కత్తెర పురుగు యాజమాన్య పద్ధతలను రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వనరులు కేంద్రం ఏ డి ఏ సి.హెచ్. వెంకటరావు, రాగోలు శాస్త్రవేత్త ఎం. శ్రీనివాసరావు, మండల వ్యసాయిధికారి పోలరావు , వాస్ ప్రవెల్లిక. ఎం, ఎస్. శేఖర్ పాల్గొన్నారు.

శిక్షణ కార్యక్రమం నిర్వహణ

విశాలాంధ్ర- కొత్తూరు: మండలం శోభనాపురం గ్రామంలో శ్రీకాకుళం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ పూజారి సత్యనారాయణ ఆదేశాలు మేరకు ఏం.టి సూర్యనారాయణ ఆధ్వర్యంలో 5 సంవత్సరాలు పి. ఏండి ఎస్ వేసింటువంటి వి. చిన్నమ్మి యూనిట్ ఇంచార్జి సీడ్ పెల్లటైజేషన్ వరి పంటలో పంటకోత ప్రయోగం నిర్వహించడం జరిగింది.ఈ పంట కోత ప్రయోగానికి కొత్తగా వచ్చిన ట్రైని ఐ.సి.ఐఆర్.పి మరియు సీనియర్ లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ పంట కోత ప్రయోగంలో 5ళి5 మీటర్లు లో 14.075 గ్రాములు దిగుబడి అంచనా వేయటం జరిగింది. ఈ విధంగా ఒక ఎకరానికి 27 బస్తాలు వచ్చినట్టు అంచనా వేయటం జరిగింది. ఈ పి.ఏండిఎస్ సాగు వల్ల ప్రకృతి వైపరీత్యాలు తో 3 సార్లు పంట మునిగింది. అయినా సరే పంట పడిపోకుండా ఉన్నట్లు రైతు తన అనుభవాలు చెప్పటం జరిగింది. ఈ కార్యక్రమానికి సూర్యనారాయణ, యూనిట్ ఇంచార్జి చిన్నమ్మి, లు శ్రీను, చిన్నా, బాలకృష్ణ, ట్రైని లు సంతోష్, రూప మరియు రైతులు హాజరు కావటం జరిగింది.

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు

విశాలాంధ్ర -కొత్తూరు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ముగిసాయి ముగింపు కార్యక్రమానికి మండల విద్యాశాఖ అదికారి .గోవింద రావు,యమ్.పి.టి.సి ప్రతినిధి టి.తిరుపతి రావు , ఎంపీపీ స్కూల్ఎచ్చి. ఏంప్రసాద్ రావు లు వివిద.పోటీలల్లో పాల్గొన్నవారికిబహుమతులుప్రదానం చేశారు ఈ కార్యక్రమం లో ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు రామచంద్ర రావు , తెలుగు ఉపాధ్యాయులు,పి.టిసార్ మరియు విద్యార్థులు, పాఠకులుపాల్గోన్నారు

ఎన్. సి. సి. క్యాడట్లు రక్తదానం

విశాలాంధ్ర-పలాస: స్థానిక ఎన్.బి.ఎన్.వై.ఎం.డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ టి. ప్రవీణ్ కుమారి అధ్యక్షతన, కాలేజీ ఆవరణలో గురువారం 77వ వార్షికోత్సవ దినోత్సవం సందర్భంగా మెగా రక్త దాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ రక్త దానంలో ముఖ్యముగా ఎన్సిసి క్యాడెట్స్ 20 మంది 20 యూనిట్స్ ను, ప్రాణదాత బ్లడ్ సెంటర్ నిర్వాహకులకు దానం చేసారు. రక్తదానం చేసిన క్యాడేట్లకు ప్రిన్సిపల్ ప్రవీణ అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఎన్.సి.సి. కేర్ టేకర్ వంకల రాజు మరియు వుమెన్ కేర్ టేకర్ పి. జయమ్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠకులను ఉద్యోగులుగా తీర్చిదిద్దేవీ గ్రంథాలయాలే

పిఎసిఎస్ చైర్మన్ కాంతారావు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి: పాఠకులను ఉద్యోగులుగా తీర్చిదిద్దేవీ గ్రంథాలయాలే అని సంతబొమ్మాళి మండలం పిఎసిఎస్ చైర్మన్ కూచెట్టి కాంతారావు అన్నారు. 58వ జాతీయ గ్రంథాలయాల వారోత్సవాలు ముగింపు సందర్భంగా గురువారం వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యావంతులు గ్రంథాలయాలను వినియోగించుకుని పోటీకు ఉపయోగపడే పుస్తకాలను చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంతబొమ్మాళి మండలం తెలుగుదేశం పార్టీ యువత అధ్యక్షుడు కూచెట్టి భానుప్రకాష్, లక్ష్మీపురం ఎంపీ పాఠశాల ఉపాధ్యాయులు రెడ్డి సూరిబాబు, సంతబొమ్మాళి ఎంపీ మోడల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ అంగురు రామారావు, కానూరి ఆనందరావు వెంకటేష్ గ్రంథాలయ అధికారి కే కృష్ణారావు విద్యార్థులు పాల్గొన్నారు.

మృతులు కుటుంబాలను పరామర్శించిన తిలక్

విశాలాంధ్ర - సంతబొమ్మాలి: సంతబొమ్మాలి మండలం నరసాపురం పంచాయితీ పందిగుంట గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారులు మృతి చెందటంతో, ఆ కుటుంబాలను టెక్కలి నియోజకవర్గం వైకాపా ఇంచార్జి పేడాడ తిలక్ గురువారం పరామర్శించారు. పిల్లల సుధీర్ ముద్ద అవినాష్ అనే చిన్నారులు మంచినీటి కుంటలో కి స్నానానికి వెళ్లి మృతి చెందిన సంగతి పాఠకులకు తెలిసిందే. ఈ మేరకు వారి తల్లిదండ్రులకు పరామర్శించి సంఘటనకు సంబంధించిన వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులు మృతి చెందడం దురదృష్టకరమని ఆయన అన్నారు. ఆయనతోపాటు నందిగామ మండలం ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి, నరసాపురం పంచాయతీ సర్పంచ్ దుక్క భూషణ్ రెడ్డి, వైయస్సార్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

చివరి చూపు కోసం..ఎదురు చూస్తున్న ఉద్దానం..!

మెట్టూరు జోగారావు మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి
మృతదేహాన్ని బంధువులకి అప్పగించిన పోలీసులు
నేడు బాతుపురంలో అంత్యక్రియలు..

విశాలాంధ్ర-పలాస: ఉద్యమాల పురిటిగడ్డ ఉద్దానంలో మరో తార రాలిపోయింది.. సుమారు 37 ఏళ్ల అజ్ఞాత జీవితంలో ఉన్న వజ్రపుకొత్తూరు మండలం బాతుపురం గ్రామానికి చెందిన మెట్టూరు జోగారావు అలియాస్ టెక్ శంకర్ విగత జీవిగా గ్రామానికి చేరుకోనుండడంతో ఆఖరి చూపు కోసం ఉద్దానం వేచి చూస్తున్నది. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి సమీపంలో జియమ్మ వలసలో బుధవారం పోలీసులు- మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్ట్ పార్టీ అగ్రనేత మెట్టూరి జోగారావు అలియాస్ టెక్ శంకర్ పోలీస్ తూటలకు బలైపోయిన విషయం తెలిసిందే. జోగారావు మృతదేహం రంపచోడవరం ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్నదని పోలీసులు ద్వారా సమాచారం అందుకున్న కుటుంబీకులు బంధువులు గురువారం ఉదయం అక్కడికి చేరుకున్నారు. సాయంత్రం జోగారావు మృతదేహానికి పోస్టుమార్టం చేసి కుటుంబీకులకు అందజేసినట్లు తెలుస్తోంది. శుక్రవారం ఉదయానికి జోగారావు మృతదేహం స్వగ్రామమైన బాతుపురం చేరుకోవచ్చని తెలుస్తోంది. 1985 సంవత్సర కాలంలో పీపుల్స్ వార్ పార్టీ వన్ ప్లస్ టు సిద్ధాంతంతో ఉద్దానం గ్రామాల్లో పార్టీ నాయకత్వ బలోపేతం కోసం అడుగులు వేస్తున్న క్రమంలో తొలితరం పీపుల్స్ వార్ నాయకుడు మద్దు బాబురావుకి కొరియర్ గా పనిచేసినట్లు జోగారావుకు ఉద్యమం లో సమకాలీకులు చెబుతున్నారు. 1988లో పార్టీ లో పనిచేసేందుకు అజ్ఞాతం లోకి వెళ్ళిపోయినట్లు తెలుస్తోంది. పార్టీ లో కొరియర్ గా తన జీవితాన్ని ప్రారంభించిన జోగారావు డిప్యూటీ కమాండర్ స్థాయి వరకు ఎదిగారు. క్రమశిక్షణ, నిబద్ధత, చొరవను గుర్తించిన కేంద్ర పార్టీ నాయకత్వం జోగారావును సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు ప్రత్యేక శిక్షణ ఇప్పించింది. అప్పటినుంచి దళంలో శంకరన్న గా ఉన్న పేరు టెక్ శంకర్ గా స్థిరపడి పోయింది . తూటాలు,తుపాకీలు తయారీ, రాకెట్ లాంచర్ల తయారీలో జోగారావు నిష్ణాతుడు అని చెబుతుంటారు. కొయ్యూరు సీలేరు పోలీస్ స్టేషన్ ల మీద ఉపయోగించిన రాకెట్ లాంచర్లు ఈయన పరిరక్షణలోనే జరిగినట్లు తెలుస్తోంది. చిన్నతనం నుంచి ఎదుటి వ్యక్తులకు సహాయాన్ని అందించే గుణం కలిగిన జోగారావు దళంలోకి వెళ్లిన తర్వాత కూడా అదే గుణం తో ఉండేవాడిని చెబుతున్నారు. నక్సల్ బరి, పీపుల్స్ వార్, నేడు మావోయిస్టు ఉద్యమానికి ఎంతోమంది వీరులను అందించిన ఉద్దాన ప్రాంతం చివరగా మిగిలిన ఇద్దరిలో ఒకరైన జోగారావు ను 37 ఏళ్ల తర్వాత చివరి చూపు చూసేందుకు కుటుంబీకులతో పాటు, బాతు పురం గ్రామస్తులు, ఉద్దానంలోని పలు గ్రామాల ప్రజలు ఎదురుచూస్తున్నారు.

రెండు సార్లు పోలీసులుకు చిక్కిన జోగారావు:

పీపుల్స్ వార్ పార్టీలో జోగారావు కొరియర్ గా పని చేస్తున్న కాలంలో 1990 లో ఉద్దానంలో గ్రెనేడ్ పేలడంతో పార్టీ కి చెందిన నాయకులు గాయాల పాలయ్యారు. వీరిని విశాఖ ఆస్పత్రికి ఒక ప్రైవేటు వాహనంలో తీసుకొని వెళ్తున్న సందర్భంలో నరసన్నపేట వద్ద జోగారావు తో పాటు మిగిలిన వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. కొద్ది నెలలు జైలు జీవితం అనుభవించి బెయిల్ పై బయటికి వచ్చారు. జోగారావు మరల పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనేవాడు. పార్టీ అప్పగించిన పనిమీద నల్లమల అటవీ ప్రాంతానికి వెళ్తున్న జోగారావు విజయవాడ నుండి తిరుగు ముఖం పట్టాల్సి వచ్చింది. అదే సమయంలో ఎమ్మెల్యేగా ఉన్న మాగంటి సుబ్బిరామి రెడ్డి హత్య జరగడం, జోగారావు పోలీసులకు చిక్కడం, అతని చేతిలో విజయవాడ కేంద్రం పేపర్ ఉండడంతో సుబ్బిరామి రెడ్డి హత్యలో జోగరావు పాత్ర ఉందని అనుమానంతో పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. ఆ కేసు లో బెయిల్ పై వచ్చిన తర్వాత జోగారావు నేటి వరకు పోలీసులకు చిక్కకుండా అజ్ఞాతంలోనే ఉన్నారు. జోగారావు మొట్టమొదట చందనగిరి దళంలోను, ఈస్ట్ డివిజన్ ఎల్లవరం దళంలోనూ డిప్యూటీ కమాండర్ గా పనిచేశారు.

గ్రంధాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-మందస: స్థానిక శాఖ గ్రంథాలయంలో గురువారం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు వేడుకలు సందర్భంగా పిల్లలకు వివిధ రకమైన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల ఎంఈఓ భాస్కర రావు మరియు గ్రామ సర్పంచ్ ప్రతినిధి లక్ష్మణరావు ఈవో నవీన్ సూర్యోదయ స్కూల్ కరస్పాండెంట్ నాగేశ్వరరావులు పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారిని జే విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు.

నేడు దోకులపాడు మెగా ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు: దోకులపాడు గ్రామంలో ఈ నెల 21వ తేదీ శుక్రవారం శ్రీకాకుళం జెమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ ప్రతినిధి వడ్డి కరుణాకరరావు తెలిపారు. ఈ శిబిరాన్ని రోగులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-రణస్థలం: మండలంలో శుక్రవారం నాడు 33/11 కే వి %ఖశీర్ఘు% విద్యుత్ ఉప కేంద్రంలోని 11 కేవీ కోస్తా ఫీడర్ పరిధిలో గల అన్ని గ్రామాలకు కోస్తా వల్లభరావుపేట, వెంకటరావుపేట, ఉప్పివలస తదితర గ్రామాలలో ఉదయం 8 గం నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగును. కావున వినియోగదారులు సహకరించగలరని రణస్థలం ఏ ఈ తిరుపతి రావు తెలిపారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

విశాలాంధ్ర-సోంపేట: సోంపేట మండలంలో మండల పరిషత్ నిధుల ద్వారా చేపడుతున్న వివిధ పనులను ఆయా కాంట్రాక్టర్లు తొందరగా ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు ఆదేశించారు. ఈ మేరకు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఈశ్వరమ్మ, మండల ఇంజనీరింగ్ అధికారి రమేష్, వర్క్ ఇన్స్పెక్టర్ పండాలతో పనులను సమీక్షించారు. తొందరగా ఎంబుక్స్ రికార్డ్ చేసి పనులు పూర్తయిన వెంటనే బిల్లులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే మండల పరిషత్ భవనంలో ఆధునీకరణ పనులను ఎంపీపీ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : ఇటీవల మొంథా తుఫాను సమయంలో కురిసిన వర్షాలకు మండలంలో బొడ్డఖాళి గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన పులి సోమయ్య పెంకుటిల్లు గోడ కూలిపోవడంతో బాధిత కుటుంభాన్ని ఆదుకుంటామని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.పి కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోళ్ళ రాజేష్ అన్నారు. గోడకూలిపోయిన విషయాన్ని ఇచ్ఛాపురం మండల అధ్యక్షురాలు దుర్గాశి నిలవేణి ద్వారా తెలుసుకున్న రాజేష్ గురువారం గ్రామానికి వెళ్ళి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, 5వేల రూపాయలతో పాటు నిత్యవసర సరుకులను అందించారు. బాధిత కుటుంభానికి ప్రభుత్వం ద్వారా తగిన సహాయం అందేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. అనంతరం గ్రామంలో వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించి నిలిచిపోయిన అభివృద్ధి పనులు పరిశీలించగా అక్కడి ప్రజలు చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని తెలిపారు. స్పందించిన రాజేష్ సంబంధిత అధికారులకు, దేవాదయ శాఖ దృష్టికి తీసుకువెళ్ళి అభివృద్ధి పనులకు సహాయం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇచ్ఛాపురం మండల నాయకులు చీకటి కృష్ణయ్య, మున్సిపాలిటీ ఇన్చార్జి రోకళ్ల భాస్కరరావు, సోంపేట మండల నాయకులు పెద్దింటి రవీంద్ర వర్ధన్, జన సైనికులు లండ శ్రీనివాస్, బుద్దాల అశోక్, చక్రవర్తి, అప్పన్న, లండ చిన్నయ్య, పుల్లి శివ, ప్రకాష్, దక్కత టింకు, పరుశురాం, దేవరాజు, కొత్తపల్లి బలరాం, వాసు, రంగాల విక్కి, రత్నాల సురేంద్ర, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

క్రిస్టియన్ మైనార్టీ ప్రధాన కార్యదర్శికి ప్రశంశలు

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : వై.సి.పి క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర విభాగం ప్రధాన కార్యదర్శి ప్రత్తి అన్వేష్ ఆల్ ఇండియా పాస్టర్స్ ఫెడరేషన్ ద్వారా ప్రశంశలు అందుకున్నారు. గుంటూరు కృప మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన అన్వేష్ సేవలను ఫెడరేషన్ ప్రశంశించింది. మీడియా కమ్యూనికేషన్స్ కోఆర్డినేటర్‌గా అతన్ని ఫెడరేషన్ నియమించింది. ఈ సందర్భంగా అన్వేష్ మాట్లాడుతు క్రైస్తవులకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారాలు, దాడులను పూర్తి స్థాయిలో అడ్డుకునేందుకు తన వంతు బాధ్యతలను నిర్వర్తిస్తానని అన్నారు. వివిధ ప్రాంతాల నుండి హాజరైన ప్రముఖులు రాష్ట్రంలో క్రైస్తవానికి వ్యతిరేకంగా జరుగుతున్న పరిస్థితులను చక్కదిద్దే అంశాలపై చర్చ జరిగిందని, స్థానికంగా పట్టణం జిల్లా స్థాయి సంఘాల వారితో కూడా సంప్రదించే చర్యలు తాను చేపట్టనున్నట్లు అన్వేష్ తెలిపారు. నేషనల్ ప్రెసిడెంట్ బిషప్ రెబ్బ ఇమ్మనీయేల్, స్టేట్ ప్రెసిడెంట్ కె.ప్రభాకరరావు, ఫౌండర్ సెక్రటరీ పి. జీవన్ కుమార్, సలహాదారులు అడిషనల్ డి.జి.పి కుంచోడి బాబూరావు, జాయింట్ సెక్రటరీ జేమ్స్, వి.కె కుంపట్ల వంటి వారి ప్రశంశలు పొందడం ద్వారా తన బాధ్యత మరింత పెరిగిందని ఈ సందర్భంగా అన్వేష్ తెలిపారు.

సిఐఐ సమ్మిట్‌లో ప్రకటించిన పెట్టుబడులు బూటకం

- వైసీపీ యువనేత తమ్మినేని చిరంజీవి నాగ్

విశాలాంధ్ర-ఆమదాలవలస: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించామని చెబుతున్న సీఐఐ సదస్సు -2025 లో ప్రకటించిన పెట్టుబడులు, ఎంవోయులు, ఉద్యోగాల గణాంకాలన్నీ వాస్తవం కాదని, వీటి వెనుక ఉన్న నిజాన్ని ప్రజల ముందుకు తేవాల్సిన అవసరం ఉందని వైసీపీ యువ నేత తమ్మినేని చిరంజీవి నాగ్ అన్నారు. గురువారం ఆమదాలవలసలోని తన నివాసంలో మీడియాతో చిరంజీవి నాగ్ మాట్లాడారు. ప్రభుత్వం ప్రచారం చేస్తున్న అభివృద్ధి కథనం పూర్తిగా సంఖ్యల మాయాజాలం అని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం 613 సంతకాలు అయ్యాయని చెప్పింది. కానీ వాటిలో ఎన్ని పూర్తి గా కొత్త పెట్టుబడులు అనే విషయాన్ని తేటతెల్లం చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ కాలంలోనే పూర్తయిన పాత ఒప్పందాల పునరుద్ధరణను కూటమి సర్కార్ తమ గొప్పగా చెప్పుకోవడం ఆక్షేపనీయమన్నారు. ఈ కీలక విషయాల్లో ఒక్కటీ ప్రభుత్వం వెల్లడించకపోవడం ప్రజల్లో అనుమానాలను మరింత పెంచుతోందన్నారు. సీఐఐ సమ్మిట్‌లో మొత్తం రూ. 13.25 లక్ష కోట్ల పెట్టుబడులు వస్తాయంటూ ప్రభు త్వం చెప్పిన గణాంకాలను తీవ్రంగా తప్పుపట్టిన ఆయన, ఇలాంటి భారీ పెట్టుబడులకు అవసరమైన ప్రాజెక్ట్ వివరాలు, లొకేషన్, భూముల కేటాయింపు, ఆమోదాలు ఏవి ప్రజలకు చూపించపోవటం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. ప్రకటనలు కాకుండా ప్రాజెక్టుల జాబితా, గ్రౌండింగ్ వివరాలు, పెట్టుబడుల ఆధారాలు, ఉద్యోగాలు కల్పన వంటివి ప్రజలకు చూపించాలన్నారు. నిజమైన డేటా ఉంటే ప్రభుత్వం దాచాల్సిన పని ఉండదన్నారు.

అజ్జరాంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో మండలం అజ్జరాం గ్రామంలో గుర వారం ప్రత్యేక శిబిరం ప్రారంభమైంది. ఈ సందర్భంగా స్పందన స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పంచిరెడ్డి కృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే యువత సేవాదృక్పథం అలవర్చుకునేందుకు ఎన్ఎస్ఎస్ దోహదపడుతుందన్నారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.వనజ పర్యవేక్షణలో నిర్వహించనున్న ఈ శిబిరం ఈ నెల 26వ తేదీ వరకు కొనసాగుతుంది. ఈ కార్య క్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ -2 పీవో డాక్టర్ డి.తాతారావు తదితరులు పాల్గొన్నారు. కోమలి మల్టీ స్పెషాల్టీ (శ్రీకాకుళం) వారిచే ఉచిత దంత వైద్యశిబిరాన్ని నిర్వహించారు.

గ్రంధాలయాలు, పుస్తక పఠనంతో మేధా సంపత్తి అధికం

- కాకినాడ శ్రీ ఆదిత్య కళాశాల ప్రిన్సిపాల్ యన్.వి. వేణుగోపాల్

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్: పుస్తకపఠనంతో విద్యార్థుల మేధాసంపత్తి పెరుగుతుందని, గ్రంధాలయాలు దేవాలయాలు లాంటివని కాకినాడ శ్రీ ఆదిత్య కళాశాల ప్రినిపాల్ యన్. వి. వేణుగోపాల్ అన్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల రోడ్డులో గల కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాల లో 58వ గ్రంధాలయాల వారోత్సవాల ముగింపు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యునివర్సిటి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్. కే.శ్రీనివాసరావు, కాకినాడ శ్రీ ఆదిత్య జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.డిల్లీశ్వరరావు, కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ యన్.వి.వేణుగోపాల్, లైబ్రేరియన్ పి. కృష్ణారావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్బం గా అతిదులు పద్మశ్రీ ఎస్ ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ పుస్తక పఠనం విద్యార్థుల ఆలోచన శక్తిని పెంచడంలోనూ, భావోద్వేగాలను నియంత్రిం చడంలోనూ , జ్ఞాపక శక్తిని పెంచటం లోనూ ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం ముఖ్య అతిథి చేతుల మీదుగా విద్యార్థులకు మరియు వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.

- కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో.....

నగరంలోని ఎల్ఐసి కార్యాలయం ప్రక్కన ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న గ్రంథాలయాల వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డా.బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం గ్రంథాలయ శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ దువ్వు చక్రఫాణి ఎస్.ఆర్.రంగనాథన్ చిత్రాటానికి పూల మాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ప్రస్తుత రోజులలో అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ పైన అవగాహన కల్పిస్తూ ఈ టెక్నాలజీ మొత్తానికి మూలం గ్రంథాలయాలు అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.శివ శంకర్, కళాశాల లైబ్రేరియన్ పి. వై . కమల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంట స్వదేశీ... ఇంటింటా స్వదేశీ...

- బీజేవైఎం జిల్లా అధ్యక్షులు బూరె నరేంద్ర చక్రవర్తి

విశాలాంధ్ర-టెక్కలి: బీజేపీ ఆధ్వర్యంలో టెక్కలి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆత్మ నిర్భర్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ యువ మోర్చా శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు బూరె నరేంద్ర చక్రవర్తి విచ్చేసి ప్రతి ఇంట స్వదేశీ... ఇంటింటా స్వదేశీ అనే నినాదం కాదు దేశ ఆత్మగౌరవం అంటూ విద్యార్థులు, యువత స్థానిక వస్తువులను ఉపయోగిస్తూ స్వదేశీ ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా స్థానిక ఉత్పత్తులను వినియోగించి నట్లయితే స్వయం సమృద్ధి భారత్ గా దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అయ్యి, 2047 నాటికి భారతదేశం వికసిత భారత్ గా ముందుకు అడుగులు వేస్తుంది అనుటలో సందేహం లేదని తెలియజేశారు. ప్రిన్సిపాల్ గోవిందమ్మ విచ్చేసి ప్రధానమంత్రి మోడీ దేశాభివృద్ధిలో నిరంతరం కృషి చేస్తూ స్వదేశీ సంకల్పం ప్రేరణగా దేశ ప్రజలందరూ ముందుకు అడుగులు వేయాలని ప్రజలకు పిలుపునిచ్చిన సందేశాన్ని గుర్తు చేసి, ఈ ఉద్యమంలో యువత మరియు విద్యార్థులు పెద్ద ఎత్తున పాలుపంచుకొని ముందుకు సాగాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి శేషనపురి శ్రీను, మండల ఉపాధ్యక్షులు ఆకుల ప్రకాష్, మండల కోశాధికారి రాంబాబు, కళాశాల అధ్యాపకులు హరి, ఫిజికల్ డైరెక్టర్ బూరె సత్యనారాయణ, శ్యామ్, ముకుందరావు, రమణ, మరియు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

సంధ్యా దీపోత్సవాల ఆధ్యాత్మిక శోభ

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండలం బల్లిపుట్టుగ గ్రామంలోని భవాని శంకర ఆలయం కార్తీకమాసం సందర్భంగా ప్రతిరోజు సంధ్య వేళ ఆధ్యాత్మిక కాంతులతో దేదీప్యమానంగా మారుతోంది. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్తీక దీపం గ్రామానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఆలయ పునర్నిర్మాణం అనంతరం ఆధ్యాత్మిక కార్యక్రమాలు విశేష ఆదరణ పొందుతున్నాయి.

ప్రతిరోజూ సాయంత్రం సుమారు 30 మంది చిన్నారులు శివనామస్మరణ చేస్తూ ఆలయ ప్రదక్షిణలు నిర్వహించడం భక్తులను ఆకట్టుకుంటోంది. మహిళలు, కుటుంబాలు కలిసి దీపారాధనలో పాల్గొనడం భక్తి పరిణామానికి దోహదం చేస్తోంది.ఆలయ ధ్వజస్తంభం వద్ద 108 దీపాలను వెలిగించడం స్థానిక ఆచారంలో అత్యంత ప్రాముఖ్యత కలిగి ఉంది.దీప కాంతులు ఏడు తరాల వంశాభివృద్ధికి దోహదం చేస్తాయన్న విశ్వాసం గ్రామంలో బలంగా ఉంది.ప్రతిరోజు ఉదయం చిన్నారులతో గ్రామ సంకీర్తన కార్యక్రమం కూడా కొనసాగుతోంది.శీతాకాలంలో చిన్నారులు ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొనడం గ్రామ సంప్రదాయాలకు జీవం పోస్తోందని పెద్దలు అభిప్రాయపడుతున్నారు.భవాని శంకర ఆలయ కమిటీ ప్రతిరోజూ ఒక కుటుంబానికి ఆకాశదీపం వెలిగించే అవకాశాన్ని కల్పిస్తోంది. సంవత్సరానికి కేవలం 30 కుటుంబాలకు మాత్రమే అవకాశం ఉండటంతో వచ్చే రెండేళ్ల వరకు జాబితా పూర్తయినట్లు కమిటీ తెలిపింది.

కార్తీక పురాణ పఠనం ముగింపు...

ఆకాశదీపం వెలిగించిన అనంతరం స్వామివారికి అభిషేకాలు, ధూపదీప నైవేద్యాలు సహా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో దాదాపు 200 మంది భక్తులు ఆలయ ప్రాంగణంలో శివనామ స్మరణలో పాల్గొంటారు. అనంతరం ప్రతిరోజూ ఒక అధ్యాయం చొప్పున కార్తీక పురాణ పఠనం కొనసాగుతోంది.కార్తీకమాసం పవిత్రతను ప్రతిబింబిస్తూ నేటితో 30వ అధ్యాయం పారాయణంతో కార్తీక పురాణ పఠనం ముగుస్తోంది. సంధ్యా దీపారాధన కూడా గురువారంతో ముగిసింది. నేటి పాడ్యమి తిథితో కార్తీకమాసానికి అధికారిక ముగింపు పలుకనున్నారు.

విద్యార్థి నిజాయితీకి అభినందనలు

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : తనకు రోడ్డు పై దొరికిన విలువైన అభరణాన్ని సంబంధిత వ్యక్తికి అందివ్వడం ద్వారా పట్టణంలో గొల్లవీధికి చెందిన రోహిత్ పూరి తన నిజాయితీని చాటుకున్నాడు. గొల్లవీధికి చెందిన మాజీ సైనికోద్యోగి దక్కత విశ్వనాధం బుధవారం సాయింత్రం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా తన మెడలోని బంగారు గొలుసు పడిపోయింది. కొద్ది దూరం వెళ్ళాక మెడలోని ఆభరణం లేకపోవడాన్ని గమనించి చాలా చోట్ల వెతికి ఫలితం లేకపోవడంతో నిరాశతో ఇంటికి వెనుదిరిగారు. గొలుసు దొరికిన రోహిత్ వీధిలో చుట్టప్రక్కల వారిని సంప్రదించి బంగారు గొలుసు ఎవరిదని వాకబు చేసి చివరికి మాజీ సైనికోద్యోగిని కలిసి అతను ఆభరణాన్ని పోగొట్టుకున్న సంగతి తెలిసి తనకు దొరికిన గొలుసు చూపగా ఆభరణాన్ని పోగొట్టుకున్న బాధితులు ఆనందానికి హద్దులు లేకపోయాయి. ఇదే విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు తెలిపి విద్యార్థి నిజాయితీని వివరించారు. దాంతో ఎమ్మెల్యే విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో దక్కత విశ్వనాధం, తెలుగుదేశం పార్టీ బి.సి సాధికార సమితీ కన్వీనర్ కొండా శంకర్‌లు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట: ఎమ్మెల్యే డాక్టర్ అశోక్

విశాలాంధ్ర-సోంపేట: పేదల వైద్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోందని ప్రభుత్వం, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ పేర్కొన్నారు. సోంపేట, కంచిలి మండలాల్లో గల అనేక మంది అనారోగ్య బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం అందజేశారు. కంచిలి మండలం పరిధిలోని ఏడు కుటుంబాలకు సంబంధించి వైద్య ఖర్చుల కోసం 5లక్షల 418 రూపాయల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందించారు. జలంత్రకోట గ్రామంలో ఉమ్మడి బోడమ్మకు 1,11,300 రూపాయలు, జాడుపూడి గ్రామంలో బొరిశెట్టి జగన్నాయకులు 35వేల రూపాయలు, విజయకుమార్ మోహన్‌కు 33,501 రూపాయి, అంపురంలో బడియా చంద్రయ్యకు 96,326 రూపాయలు, కొక్కిలిపుట్టుగలో భగవాన్ బిసాయికి 1,15,275 రూపాయలు, బొగాబెణి గ్రామంలో గుడియా బృందావతికి 76,916 రూపాయలు, వ్యక్తిగతంగా చెక్కుల రూపంలో అందించినట్లు మండల టీడీపీ అధ్యక్షుడు మాదిన రామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంచిలి మండలానికి చెందిన టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలి: ఎంపీడీఓ

విశాలాంధ్ర-హిరమండలం: ప్రతీ గ్రామం పరిశుభ్రం గా ఉంచుకో వలసిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులు పంచాయతీ సర్పంచ్ లపై నే ఉందని ఎంపీడీఓ ఆర్ కాళీ ప్రసాద్ రావు వెల్లడించారు. గురు వారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని సర్పంచ్ లకు, పంచాయతీ కార్యదర్శులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించామని ఎంపిడివో ఆర్. కాళీ ప్రసాదరావు చెప్పారు. ఈ సందర్భంగాఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో వ్యర్థాల నిర్వహణ కచ్చితంగా చేపట్టాలని ఆయన కోరారు. దీనికి పంచాయతీ కార్యదర్శులు సర్పంచ్ సమన్వయంతో చేపట్టాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణకు (రీసైక్లింగ్ చేయడం కోసం) రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రాయితీతో కూడిన యూనిట్లు మంజూరు చేస్తున్నాయని గ్రామంలోని ఉత్సాహవంతమైన యువత యూనిట్లు ప్రారంభించాలనే ఆయన కోరారు. ఈ సందర్భంగా జడ్పిటిసి పొగిరి. బుచ్చిబాబు మాట్లాడుతూ మండల స్థాయిలో ప్లాస్టిక్ వ్యర్థాల పునర్వినియోగ ప్లాంట్ ఏర్పాటుకు యువత ముందుకు వస్తే వారికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం కల్పించే రాయితీతో పాటు ప్రోత్సాహకంగా ప్లాంట్ ఏర్పాటుకు అవసరమయ్యే ప్రాధమిక ఖర్చుల నిమిత్తం 50 వేల రూపాయలు నా సొంత నిధులు సహాయం చేస్తానన్నారు. ఈకార్యక్రమంలో మండలటీడీపీ అధ్యక్షులు దను పురం సర్పంచ్ దారపు ఢిల్లే శ్వర రావు, సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు సుంకర కోటేశ్వరరావు, హిరమండలం మేజర్ పంచాయతీ ఈఓ మూల భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.